ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని నిర్మాణదారులకు నోటీసులు

గచ్చిబౌలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేసి నివాసం ఉంటున్న వారికి తహసీల్దార్ వెంకారెడ్డి గురువారం నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని దుర్గంచెరువు, గంగారంలోని పెద్దచెరువు, మియాపూర్ పటేల్‌చెరువు, గుర్నాథంచెరువు, కాయదమ్మకుంట, లింగంపల్లి గోపిచెరువు, నల్లగండ్ల పెద్దచెరువు, గోపన్‌పల్లి పెద్దచెరువు, మల్కంచెరువు, ఖాజాగూడ పెద్దచెరువుతో పాటు ఈ ప్రాంతాల్లో ఉన్న కుంటలు, చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నివాసాలు ఉంటున్న వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే గంగారం పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న 60 మందికి నోటీసులు జారీ చేశారు. గోపన్‌పల్లి పెద్దచెరువు పరీవాహక ప్రాంతాల్లో ఉంటున్న 50 మందికి సైతం నోటీసులు జారీ చేశారు. కాగా ఖాజాగూడ, నల్లగండ్ల పెద్దచెరువు, మక్తాపెద్దచెరువు, హఫీజ్‌పేట, కొండాపూర్ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. మిగతా వారికి రెండుమూడు రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

నేడే హెచ్‌ఏఎల్ కార్మిక యూనియన్ ఎన్నికలు

బాలానగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హిందుస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) కార్మిక యూనియన్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం జరిగే ఈ ఎన్నికల కోసం అన్ని యూనియన్లు పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. సంస్థలో 894 మంది కార్మికులు బ్యాలెట్ పేపర్ ద్వారా, 56 మంది కార్మికులు (35మంది కేరళ కాసర్‌గడ్, 21 మంది ఔట్ స్టేషన్ సిబ్బంది) పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మియాపూర్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతినగర్ డివిజన్లకు చెందిన 520 మంది లబ్ధిదారులకు 5 కోట్లా 20 లక్షలా 30 వేలా 320 రూపాయల విలువ చేసే చెక్కులను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, ఆర్ఐ రాంబాబు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఫతేనగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధి వెంకటేశ్వర నగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఘనంగా ఆహ్వానం పలికారు. శ్రీవారికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పూజల్లో పాల్గొన్నారు.

● వేడుకల్లో కార్పొరేటర్

బాలానగర్: బాలానగర్ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హోమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణమూర్తి, నర్రా దేవేందర్, ఆలయ కమిటీ ఛైర్మన్ రాజసాగర్, సగర సంఘం అధ్యక్షుడు లోకేష్, ప్రధాన కార్యదర్శి జానకిరాములు, కోశాధికారి రవిసాగర్, ఇందిరానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిసాగర్, ప్రధాన కార్యదర్శి అర్జున్ పాల్గొన్నారు.

భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ నియామకం

ఫతేనగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ శివాలయం రోడ్డులోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్త మండలి సభ్యుల నియామకం, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిటీ సభ్యులలో ఒకరైన ఉప్పలపు బాలనర్సింహారావు ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, కమిటీ సభ్యులు వరాల స్వామి, గుండాల జ్యోతి, మాధురి సతీష్‌కుమార్, కంచా రాజ్‌కుమార్, ఎక్స్ అఫీషియో మెంబర్ వారభద్రయ్య, ఎండో మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపై దాడులను ఆపాలి

దుండిగల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల ఉమ్మడి వేదిక నాయకులు, సీపీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్లు హుస్సేన్, శంకర్‌ముదిరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపైన, గ్రామ శాఖలో పని చేస్తున్న వైద్యాధికారుల దాడులు చేస్తున్నారని, ఈ దాడులను ఆపాలని కోరారు. 2009లోనే తమకు శిక్షణ ఇచ్చారని వివరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం.. వ్యక్తిపై కేసు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.35 లక్షల మేర దండుకొని మోసం చేసిన వ్యక్తిపై పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. ఢిల్లీకి చెందిన కాన్‌మ్యాన్ మిస్టర్ హిమాన్షు డింగ్రా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు, సబ్ - కాంట్రాక్టర్ ఇప్పిస్తానని సుచిత్రకు చెందిన శ్రీనివాస్‌మూర్తి, మరి కొంత మంది నుంచి రూ.35 లక్షల మేర వసూలు చేశాడు. వివిధ ప్రాజెక్టుల పేరుతో డిజిటల్, స్మార్ట్ మీటర్ల వర్క్‌ల పేరుతో శ్రీనివాస్ మూర్తి నుంచి కాన్‌మ్యాన్ మిస్టర్ హిమాన్షు డింగ్రా రూ.16 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. ఆపై పని చూపించకపోవడంతో తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరినా స్పందించక పోవడంతో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులందరూ రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సుచిత్రా, బొల్లారం జంక్షన్‌ల్లో రాంగ్‌రైట్‌పై స్పెషల్ డ్రైవ్‌ను పోలీసులు నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేస్తున్న 24 వాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్ డ్రైవింగ్, ముగ్గురు ప్రయాణం, అతివేగం వంటి ప్రయాణాలు చేయొద్దని, హెల్మెట్‌ను ధరించాలని వాహనదారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

బాలానగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాబోయే మిలాదున్ నబీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ సూచించారు. గురువారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫతేనగర్, బాలానగర్ డివిజన్ పరిధికి చెందిన ముస్లిం, మజీద్ పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి పండుగలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

బఫర్‌జోన్‌లో నిర్మించారు

- అధికారం అడ్డంపెట్టుకొని మేయర్ భర్త నిబంధనలను ఉల్లంఘించారు
- నిజాంపేట్ మేయర్ భర్తపై ఫిర్యాదు



బఫర్ జోన్‌లో చేపట్టిన భవన నిర్మాణం

నిజాంపేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ ప్రాంతంలోని బఫర్‌జోన్‌లోని సర్వే నంబరు 115, 116ల్లో కిందికుంట చెరువుకట్ట ఆక్రమించుకొని నిర్మాణం చేపట్టారని నిజాంపేట్ మేయర్ భర్త కొలన్ గోపాల్‌రెడ్డిపై కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. బఫర్‌జోన్‌లో భవన నిర్మాణానికి రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనం నిర్మిస్తున్నారన్నారు. కిందికుంట చెరువుకట్ట నుంచి 10 ఫీట్ల వదల కుండా సెల్లార్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. కొలన్ గోపాల్‌రెడ్డి అధికారం అడ్డుపెట్టుకుని బఫర్‌జోన్ చూపించకుండానే అక్రమంగా అనుమతులు పొంది జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారన్నారు. 30 మీటర్ల రోడ్డును సైతం 9 ఫీట్ల మేర ముందుకు జరిగి నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణానికి ఎన్‌ఓసీ పొందకుండానే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించుకున్నారన్నారు. భవన నిర్మాణదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. జోనల్ కమిషన్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్ మహేందర్, ఎర్రా స్వామి, కిషోర్, అరుణ్‌రావు తదితరులు ఉన్నారు.

హైడ్రా నోటీసులంటూ ఆందోళన



పద్మావతికాలనీలో నోటీసులందిస్తున్న అధికారులు

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్ సున్నం చెరు వు పరిధిలోని పద్మావతి కాలనీవాసుల్లో రెండు రోజులుగా హైడ్రా నోటీసుల భయం పట్టుకుంది. చెరువు ఆక్రమణ చేసి నిర్మాణాలు చేపట్టారం టూ బుధవారం 10 మందికి నోటీసులిచ్చామని, గురువారం మరో ఇద్దరికి నోటీసులు జారీ చేశామని కూకట్‌పల్లి రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమకు నోటీసులు అందడంతో ఆందోళన చెందుతున్నారు. మరో వైపు మైసమ్మచెరువు పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో కూడా నోటీసులు వస్తాయనే రూమర్స్‌తో వందలాది కుటుంబాలలో ఆందోళన నెలకొంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేఖర్‌యాదవ్

పార్టీ బలోపేతం కోసం అందరూ పని చేయాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసికట్టుగా పని చేసినప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పరశవేణు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ నాగమణి ఆశ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌వో కల్యాణ్‌ను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

ఏఎస్‌వోను కలిసిన సీపీఐ నాయకులు

బాలానగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాలానగర్ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా బాధ్యతలు చేపట్టిన కల్యాణ్‌ను సీపీఐ నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. అనంతరం శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. రేషన్ కార్డులు అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన వారికి వెంటనే రేషన్ కార్డులు జారీ అయ్యేలా చూడాలని వారు ఏఎస్‌వోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ, నాయకులు మనోచారి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఫతేనగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల ఇబ్బందులు సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి డిపో డీఎం డి.హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్‌లో అందుబాటులో ఉంటున్నట్లు ఆయన చెప్పారు. సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేసే వారు 99592 26151లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

దుండిగల్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా : ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

దుండిగల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'ఎంపీగా మీరు నా మీద పెట్టిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటా, భాష కొత్తదే అయినా పార్లమెంట్‌లో గట్టిగా మన ప్రాంత సమస్యలను వినిపిస్తా' అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో రూ.18 కోట్లతో చేపట్టనున్న పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో మురుగునీటికి రూ. 4.46 కోట్లు, సీసీ రోడ్డులకు రూ.10.93 కోట్లు, గ్రేవ్ యార్డ్‌కు రూ.1.82 కోట్లు, కమ్యూనిటీ హాల్స్‌కు రూ.1.40 కోట్లుతో పనులను చేపట్టనున్నట్లు తీర్మానించారు. కౌన్సిలర్స్ లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తానని ఛైర్‌పర్సన్ కృష్ణవేణి హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపల్ అభివృద్ధికి తమ సహాయ సహకారాలందిస్తానన్నారు. చెరువుల గురించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారు, పేదల కోణంలో కూడా ఆలోచన చేయాలని, 40 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లు కూలుస్తామంటే చూస్తూ ఊరుకుందామా? చెరువు ప్రక్కన ఉన్న పట్టా భూమిని అమ్ముతుంటే పేదలు వాటిని కొనుకున్నారని, అధికారులు వాటికి అనుమతులు ఇస్తే ఇళ్లు కట్టుకున్నారు. కానీ తప్పు, వందల మందికి నోటీసులు ఇచ్చి కంటి మీద కునుకు లేకుండా హైడ్రా చేస్తోందన్నారు. ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవహరిస్తోందన్నారు. మనం పేదల పక్షాన ఉండాలన్నారు. చెరువు కన్న తల్లి వంటిదని, చెరువులకు వచ్చే వాగులు, కాలువల ను పునః రుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు 20 ఏళ్ల ముందుకు ఆలోచించి పనులు మొదలుపెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ తుడుం పద్మారావు, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న దగ్గుపాటి సురేష్‌బాబు

దుండిగల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను సాధించి, తమ భవిష్యత్‌కు దీటైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని వీఎన్‌ఎస్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యక్షుడు దగ్గుపాటి సురేష్‌బాబు అన్నారు. బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజేఐఈటీలో కొత్త విద్యార్థుల 30వ బ్యాచ్ స్వాగత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సహ సంస్థ ప్రధాన కార్యదర్శి జేఎస్‌రావు, ఉపాధ్యాక్షుడు కోడె దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి అచ్యుత రామప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. విజ్ఞాన జ్యోతి సంస్థ, కళాశాల విద్యార్థులు పరస్పరం సహకరించుకుంటే తమతమ కళలను సాధించడం సాధ్యమవుతుందన్నారు. 'నేను కూడా ఇంజనీరింగ్ చదివినా.. సినీనిర్మాతగానూ, పారిశ్రామిక వేత్తగానూ ఉన్నట్టే నేటి విద్యార్థులు తమ మార్గాల్లో వైవిధ్యమైన గమ్యాలకు చేరుకోవాలి' అని అన్నారు. అనంతరం జేఎస్ రాజు మాట్లాడుతూ.. తమ పిల్లలకు కేవలం వారి ప్రతిభ వల్లనే ఇక్కడ సీటు వచ్చిందని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ చెన్నకేశవరావు, ఆచార్య డాక్టర్ సీడీ నాయుడు, ప్రొఫెసర్ చాప్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్

8 అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలకు హైదరాబాద్‌లోనే నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సుమారు 800కు పైగా సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీకై రిజిస్ట్రార్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఏ కాలేజీలో సీట్లను ఆ కాలేజీలోకాకుండా అన్ని కాలేజీల్లో సీట్ల భర్తీకి హైదరాబాద్‌లోనే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు, 31న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీల్లో సీట్లకు, 2న వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబ్‌బాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని.. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో జేఎన్‌టీయూలోని అడ్మిషన్స్ విభాగంలో హాజరుకావచ్చని తెలిపారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్ వల్ల ఖమ్మం, మహబూబాబాద్, మంథని, వనపర్తి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా భావిస్తున్నారని కొన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. ఇంతకు ముందు మంథని జేఎన్‌టీయూ కాలేజీలో సింగరేణి కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగానే వర్సిటీ అడ్మిషన్ విభాగం అధికారులు అనుబంధ కళాశాలలకు వచ్చి స్పాట్ ప్రక్రియను చేపడితే బాగుండేదంటున్నారు.

కళాశాల స్థాయిల్లో ఎన్‌ఎస్‌యూఐ కమిటీలు: వెంకటస్వామి

హైదరాబాద్,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాశాల స్థాయిలోని విద్యార్థి ప్రతినిధులతో ఎన్‌ఎస్‌యూఐ యూనిట్‌లను ఏర్పాటు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించనున్నట్టు రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శులు రాష్ట్ర ఇన్‌చార్జిలు మహ్మద్‌ఫాహద్, ప్రతీక్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉండాలని సూచించారు.

బీటెక్ అగ్రికల్చరల్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు 2న స్పాట్ కౌన్సెలింగ్

రాజేంద్రనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగిలిపోయిన సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులలో స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో హాజరుకావాలని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ కింద తెలంగాణ ఎప్‌సెట్2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్ లేదా, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

నరేడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అవగాహన సదస్సు

మియాపూర్,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): నరేడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మియాపూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, అసోసియేషన్ ఛైర్మన్ మమ్మారెడ్డి, ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజలు, బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, చెరువులు, నాలాలు, ఆక్రమణలకు గురికాకుండా చేసేలా పలు సూచనలు కమిషనర్‌కు విన్నవించారు. ప్రెసిడెంట్ బి.లక్ష్మీనారాయణ హైడ్రాను స్వాగతిస్తు ఆక్రమణల నుంచి ప్రభుత్వ ఆస్తులను, చెరువులను రక్షించే విషయంలో అసోసియేషన్ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో ట్రెజరర్ సుభాష్‌బాబు, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, మన్నే రవి, శ్రీనివాసరావు, నరేంద్రప్రసాద్, అసోసియేసన్ సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కమిషనర్‌గా సౌజన్య

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖలో బదిలీలు జరిగాయి. ఎనిమిదేళ్లుగా జీహెచ్‌ఎంసీలో తిష్ట వేసిన యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ డీ సౌజన్య నిజాంపేట మునిసిపల్ కమిషనర్‌గా బదిలీఅయ్యారు. పురపాలక శాఖలోని ఓ అధికారి అండతో కీలక పదవి దక్కిందని ప్రచారం జరుగుతోంది. నిజాంపేట్ కమిషనర్ డాక్టర్ రామకృష్ణారావును నర్సాపూర్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీచేశారు. నిజాంపేట్‌లో అనుమతుల జారీ, కూల్చివేతలపై ఆరోపణల నేపథ్యంలో కమిషనర్ బదిలీ చర్చనీయాంశంగా మారింది.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో ఫస్ట్ ర్యాంకు సాధించిన సిరిప్రియ



సిరిప్రియ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాచలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ కోర్సులో ప్రవేశాల కోసం జేఎన్ఏఎఫ్ఏయూ (జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ) నిర్వహించిన ప్రవేశ పరీక్షలో నగరానికి చెందిన పి.సిరిప్రియ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను తల్లిదండ్రులు, తోటి స్నేహితులు అభినందించారు.

ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్

సైబర్‌క్రైం, డ్రగ్స్ నిషేధంపై అవగాహన



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అవినాష్

చందానగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మాదాపూర్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో సైబర్‌క్రైం, డ్రగ్స్ నిషేధం, అవగాహన కల్పించేందుకు ఫ్రెండ్లీ పోలీస్ నినాదంతో వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ అవినాష్ ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి యువతే ముఖ్యమని యువకులు వివిధ చెడు అలవాట్లకు బానిస బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. యువకులే దేశానికి పట్టు కొమ్మలన్ని పెడదారిన వెళ్లకుండా ఉండేందుకు అవగాహన కల్పించేందుకు ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ జోన్ వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, 45మంది టీంల క్రీడాకారులు పాల్గొన్నారు.

నీటి కొలనులను శుభ్రం చేయాలి



చెరువులోని కొలన్లు పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి

గచ్చిబౌలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు అన్ని చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వెస్ట్‌జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, నల్లగండ్ల, మియాపూర్, గంగారం తదితర ప్రాంతాల్లోని చెరువుల్లో ఉన్న నీటికొలనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి కొలనుల దుస్థితి అధ్వానంగా ఉందని వెంటనే శుభ్రపరిచి కొత్తనీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్యం వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మల్కంచెరువు, గోపిచెరువు, నల్లగండ్ల పెద్దచెరువు, రామసముద్రం చెరువు, గంగారం చెరువు, గౌతంబేబిపాడ్, కడియం కుంట తదితర ప్రాంతాల్లోని నీటి కొలనులను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దన్నారు. శోభ యాత్ర జరిగే ప్రాంతాల్లో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. ఖాజాగూడ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఉపకమిషనర్లు, ఇంజనీరింగ్, పారిశుధ్యం, ఎంటమాలజీ విభాగం అధికారులు, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లపై రాజీలేదు

- అన్ని శాఖల అధికారులూ భాగస్వాములు కావాలి
- జడ్సీ అపూర్వ్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్, పక్కన ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై రాజీపడే ప్రసక్తే లేదని అపూర్వ్ చౌహాన్ స్పష్టం చేశారు. కూకట్‌పల్లి రంగదాముని చెరువు (ఐడీఎల్ ట్యాంక్) వద్ద గురువారం అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 5వ తేదీలోగా కంట్రోల్ రూం, అధికారులకు, మీడియాకు గ్యాలరీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏయే విభాగం అధికారులు ఏయే పనులు చేస్తున్నారు, పనివేళలు, ఫోన్ నంబర్లతో కంట్రోల్ రూమ్‌లో అప్డేట్ ఉండేలా మూసాపేట్, కూకట్‌పల్లి డీసీలు రమేష్, కృష్ణయ్య బాధ్యతలు తీసుకోవాలన్నారు. నిమజ్జనంలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదంటూ అధికారులను ఆదేశించారు.

● గతేడాది సమస్యలు పునరావృతం కావొద్దు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో గతేడాది సమస్యలు మళ్లీ రిపీట్ కావొద్దని, దాని కోసం ఏమి కావాలని అధికారులను అడిగారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, దీని కోసం ప్రైవేటు పార్కింగ్ స్థలాలను అందుబాటులో ఉంచాలని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ, ఏసీపీలకు సూచించారు. వ్యర్థాలను తొలగించి భక్తులకు అసౌర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వారి సూచనలు, సలహాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొడిచెర్ల మహేందర్, సబీహాబేగం, మాజీ కార్పొరేటర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

జీడిమెట్ల: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నిశాఖల అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని చెరువుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఫైర్, విద్యుత్, ట్రాఫిక్, మెడికల్, మున్సిపల్ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నర్సింహ, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఎస్ఈ చిన్నారెడ్డి పాల్గొన్నారు.